# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 09-06-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో మూడవ సారి ఏర్పాటైన ఎన్డీఏ ప్రభుత్వం ఈరోజుతో సంవత్సర పాలన పూర్తీ చేసుకుంది.
- ❖ ప్రస్తుత సవాళ్లను అధిగమించేందుకు ప్రపంచం ఇప్పుడు భారత్ వైపు చూస్తుందని కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు.
- ❖ గత దశాబ్దంతో పోలిస్తే దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తిలో 40 శాతం పెరుగుదల నమోదయ్యిందని శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు.
- ❖ యువత దేశ సామాజిక, ఆర్థిక, సాంకేతిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు.

========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో ఎన్డీఏ ప్రభుత్వం ఈరోజుతో సంవత్సర పాలన పూర్తీ చేసుకుంది. గత ఏడాది జూన్ 9న మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం చేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వానికి 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 'వికసిత్ భారత్ కా అమృత్ కాల్' అనే కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా వికసిత్ భారత్ ఎజెండానే తమ లక్ష్యమని నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం ఎక్స్ లో పేర్కొన్నారు. ఈ ఏడాది పాలనలో ఆపరేషన్ సిందూర్, వక్ఫ్ సంస్కరణలు, ప్రపంచ దేశాల్లో భారతదేశ ఖ్యాతి పెరిగిందని పేర్కొన్నారు. ఇటీవలే నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఆవిర్భవించిందని, త్వరలోనే మూడో స్థానానికి చేరుకుంటామని ప్రధానమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. మంచి పాలన, పరివర్తనే లక్ష్యంగా ముందుకువెళుతున్నామన్నారు.

========================

ఎన్డీఏ ప్రభుత్వం గత 11 సంవత్సరాలలో వికసిత్ భారత్ నిర్మాణానికి పునాది వేసిందని భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు, ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా అన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం 11 సంవత్సరాలు పూర్తి

చేసుకున్న సందర్భంగా న్యూఢిల్లీలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం బాధ్యతాయుతమైన, జవాబుదారీ పాలనను అందించడం ద్వారా దేశ రాజకీయ సంస్కృతిని మార్చిందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వాన్ని ధైర్యమైన నిర్ణయాలు తీసుకునే సమర్థవంతమైన ప్రభుత్వంగా ఆయన అభివర్ణించారు. ప్రజల నేతృత్వంలోని పారదర్శకతకు నూతన ప్రమాణాలను నిర్దేశించిందని ఆయన మాట్లాడుతూ..

(వాయిస్ 40 సెకన్లు)

=======================

ప్రస్తుత సవాళ్లను అధిగమించడానికి ప్రపంచం ఇప్పుడు భారతదేశం వైపు చూస్తుందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ అన్నారు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న ఐక్యరాజ్యసమితి ఓషియన్ కాన్ఫరెన్స్ సమ్మిట్ గురించి ఈరోజు ఆయన పాత్రికేయులకు వివరిస్తూ... వివిధ అంశాలలో ఇతర దేశాలు భారతదేశాన్ని ఆదర్శంగా తీసుకుంటున్నాయని, ఈ సదస్సులో గత రెండు రోజులుగా ఈ విషయాన్ని తాను గ్రహించానని చెప్పారు. సముద్ర సంబంధిత ఆందోళనలు, సవాళ్లను ఎదుర్కోవడంలో భారత్ ముందంజలో ఉందన్నారు. భూమి ఉపరితలంలో దాదాపు 70 శాతం మహాసముద్రాలు ఉండటంతో వాటి వల్ల ఏర్పడే సవాళ్లను సమిష్టిగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఒకసారి వినియోగించే ప్లాస్టిక్‌ను అధికారికంగా నిషేధించిన తొలి దేశాలలో భారతదేశం ఒకటి అని పేర్కొన్నారు.

=======================

వ్యవసాయ రంగంలో వృద్ధి సాధించకుండా భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారలేదని కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. తెలంగాణ రంగారెడ్డి జిల్లాలోని మంగళ్‌పల్లిలో ఈ రోజు జరిగిన "వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ యాత్ర"లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి రైతులతో నేరుగా సంభాషించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... ఆహార భద్రతను సాధించడం, రైతుల ఆదాయాన్ని పెంచడం భవిష్యత్ తరాల కోసం నేల ఆరోగ్యాన్ని సంరక్షించడంపై దృష్టి సారిస్తూ... ఈ వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ యాత్రను దేశ వ్యాప్తంగా చేపట్టామన్నారు. అలాగే ఎన్డీయే కూటమి ప్రభుత్వం 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంపై ఆయన స్పందిస్తూ... వ్యవసాయరంగానికి సంబంధించి గత త్రైమాసికంలో 5.4 శాతం వృద్ధి రేటును సాధించడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దార్శనిక విధానాలు దోహదపడ్డాయన్నారు. నేడు ఆహార ధాన్యాల ఉత్పత్తి రికార్డు స్థాయికి చేరుకుందని, గత దశాబ్దంతో పోలిస్తే 40 శాతం పెరుగుదలను సూచిస్తుందని శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

=======================

యువత దేశ సామాజిక, ఆర్థిక, సాంకేతిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. ఈరోజు జోధ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి)లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... యువత ఉద్యోగార్థులుగా కాకుండా ఉద్యోగ ప్రదాతలుగా మారుతున్నారని, ఈ మార్పుకు ఐఐటీలు ముఖ్య భూమిక పోషిస్తున్నాయని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా నైపుణ్యం, వినూత్న ఆలోచనలు ఉన్న భారతీయ యువతకు భారీ డిమాండ్ ఉందని ఆయన అన్నారు.

=======================

స్వాతంత్ర్య పోరాట వీరుడు భగవాన్ బిర్సా ముండా వర్ధంతి సందర్భంగా ఈరోజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయనకు నివాళులర్పించారు. భగవాన్ బిర్సా ముండా గిరిజన సోదర సోదరీమణుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ కోసం తన జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. ఆయన త్యాగం, అంకితభావం దేశ ప్రజలకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయని సామాజిక మధ్యమములో నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

========================

ప్రపంచంలోనే అతిపెద్ద కంటైనర్ షిప్ ఎంఎస్‌సీ ఇరినా (MSC) కేరళలోని విజింజం అంతర్జాతీయ ఓడరేవుకు ఈరోజు చేరుకుంది. ఈ ఓడ 399.9 మీటర్ల పొడవు, 61.3 మీటర్ల వెడల్పు, 26 అడుగుల ఎత్తుతో ఫుట్‌బాల్ మైదానం కంటే దాదాపు నాలుగు రెట్లు ఎక్కువ పరిమాణం కలిగిఉంది. ఆసియాలోని ప్రధాన తయారీ కేంద్రాలను ఐరోపాలోని వినియోగదారుల మార్కెట్లతో అనుసంధానించడంలో ఈ నౌక కీలక పాత్ర పోషిస్తుంది.

========================

మలేసియాలో ఈరోజు రోడ్డు ప్రమాదంలో 15 మంది విద్యార్థులు మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. ఉత్తర మలేషియాలోని విశ్వవిద్యాలయం విద్యార్థులను క్యాంపస్‌కు తీసుకువెళ్తున్న బస్సును ఓ మినీవ్యాన్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనా స్థలానికి చేరుకున్న సహాయక బృందాలు 30 మందికి పైగా క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో అందరూ 21 నుంచి 23 సంవత్సరాల మధ్య వారేనని అధికారులు పేర్కొన్నారు.

========================

అంతరిక్ష రంగానికి సంబంధించిన ఇస్రో, నాసా సంయుక్తంగా చేపడుతున్న ఎక్స్‌ఐఓఎం-4 మిషన్ భారత వ్యోమగామి సుభాన్షు సుక్లా ఎంపికయ్యారు. దీనిపై కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ స్పందిస్తూ... సుభాన్షు సుక్లా ఎంపిక అవ్వడంతో భారత అంతరిక్షరంగ సామర్థ్యాలు ప్రపంచానికి మరోసారి రుజువు అయ్యాయని అన్నారు. విక్రమ సారాభాయ్, సతీష్ ధావన్‌లకు ఇది నిజమైన నివాళి అని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

========================

నగర పర్యావరణాన్ని మెరుగుపరచడానికి ఈ సీజన్‌లో 70 లక్షల చెట్లను నాటాలని ఢిల్లీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి రేఖా గుప్తా అన్నారు. "ఏక్ పెడ్ మా కే నామ్" కింద ఈరోజు న్యూఢిల్లీలోని షాలిమార్ బాగ్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఆమె తల్లి జ్ఞాపకార్థం సిందూర మొక్కను నాటారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... 'ఏక్ పెడ్ మా కే నామ్' రెండవ దశలో ఢిల్లీ విద్యా శాఖ అధికారులు, పాఠశాల విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు.

========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 82,188 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై.... చివరికి 256 పాయింట్ల లాభంతో 82,445 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 100 పాయింట్లు లాభంతో 25,103 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.63గా ఉంది.

========================
========================